క్లుప్తంగా

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలో కొత్తగా పట్టాదారులైన రైతులు ఈనెల 13లోగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి ఎల్.పద్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5 వరకు పట్టా పాస్‌బుక్ వచ్చిన, అంతకు ముందు బీమా చేసుకోని రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్త రైతులు దరఖాస్తు ఫారం, పట్టాదారులు పాస్‌బుక్ జిరాక్స్, లేదా తహసీల్దార్ డిజిటల్ సంతకం చేసిన డీఎస్ పేపర్, ఆధార్‌కార్డులతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 1966 ఆగస్టు 14 నుంచి 2007 ఆగస్టు 14 తేదీల మధ్యలో పుట్టిన రైతులు మాత్రమే బీమాకు అర్హులని తెలిపారు. ఆధార్‌కార్డులో 18 నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్న రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పోచమ్మ తల్లి ఆలయ పునఃప్రతిష్ఠాపన



ఐనవోలు: మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో దాతల సహకారంతో చేపట్టిన పోచమ్మ తల్లి నూతన ఆలయ నిర్మాణం, పునఃప్రతిష్ఠ ఆదివారం పూర్తయినట్లు గ్రామస్తులు తెలిపారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

సల్లంగా చూడు పోచమ్మతల్లి



ఆత్మకూరులో బోనాలతో వస్తున్న మహిళలు

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం పోచమ్మ తల్లి బోనాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి చీర, సారె, బోనాలు సమర్పించారు. తల్లీ సల్లంగా చూడు అంటూ మొక్కులు చెల్లించుకున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు : ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరు శ్రద్ధ వహించాలని ఆత్మకూరు దేశాయ్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఏరుకొండ రవీందర్‌గౌడ్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం రవీందర్ గౌడ్ మాట్లాడుతూ వాసన్ కేర్ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎక్స్ సర్వీస్‌మెన్ గుర్రం ప్రభాకర్, లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ టింగిలికారి సత్యనారాయణ, సెక్రటరీ నాగబండి శివప్రసాద్, ట్రెజరర్ బాదం వెంకటేశ్వర్లు, తాళ్ల చంద్రయ్య, గుర్రం ఆనందం, బుచ్చిరెడ్డి, వాసన్ అనిశెట్టి చేతన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుడికి నివాళి



కుమారస్వామి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఏఎంసీ చైర్మన్ రాజిరెడ్డి

పరకాల : అనారోగ్యంతో 10 రోజులుగా నిమ్స్‌లో చికిత్స పొందుతున్న పరకాల వ్యవసాయ మార్కెట్ హమాలీ కార్మికుడు జన్ను కుమారస్వామి మృతి చెందాడు. కామారెడ్డిపల్లె గ్రామానికి చేరుకున్న హమాలీ కార్మికుడి మృతదేహానికి పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డితో పాటు హమాలీ సంఘం నాయకులు నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లంకదాసరి అశోక్, కార్మిక సంఘం నాయకులు కోగిల శంకర్, బొట్ల భద్రయ్య, నాగెల్లి కోట యాదగిరి, డబ్బా రాజయ్య, శ్రీపతి కుమారస్వామి, శెరిపల్లి రాజేందర్ తదితరులు ఉన్నారు.

పచ్చదనంతో పంటలు

- వరి 14,000, పత్తి 3,300, మొక్కజొన్న 90 ఎకరాల్లో సాగు
- సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

ఎల్కతుర్తి : ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు వాతావరణానికి తట్టుకొని పచ్చదనంతో ప్రధాన పంటలైన వరి, పత్తి, మొక్కజొన్న పంటలు కళకళలాడుతున్నాయి. ఎల్కతుర్తి మండలంలో 20 గ్రామ పంచాయతీలకు మరో 3 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. వీటికి గాను మండల వ్యాప్తంగా 21,777 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. ఇందులో వరి 14వేల ఎకరాల్లో సాగు కాగా, పత్తి 3,300, మొక్కజొన్న 90 ఎకరాల్లో సాగు చేయగా మిగతాది ఇతర పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. సాగు చేసిన పత్తి, మొక్కజొన్న పంటలో ఇటీవలే వరంగల్ శాస్త్రవేత్తలు రసంపీల్చు పురుగు ఆశించినట్లు గుర్తించారు. వాటి నివారణ కోసం రైతులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వడంతో శాస్త్రవేత్తల సూచనమేరకు మందులు పిచికారీ చేయడంతో పంటలు పచ్చదనంతో నిండుకొని ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభంలో కురిసిన వర్షాలకు రైతులు ఖరీఫ్ సాగు ప్రారంభించారు. అయితే ప్రారంభంలో మురిపించిన వర్షాలు ఆ తర్వాత కురువక పోవడంతో రైతులు ఆకాశంవైపు దీనంగా ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మార్చి చివరి వారంతో పాటు ఆగస్టు నెలలో కురుస్తున్న వర్షాలతో రైతులు సంతోషం వ్యక్తపరుస్తున్నారు. ఏది ఏమైనప్పటికి వర్షాలు కురుస్తుండడం వల్ల పంటలకు సరిపడా నీరు వచ్చే అవకాశం ఉందని మండల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు ఎస్సారెస్పీ కాల్వ నీరు సైతం విడుదల చేసినట్లయితే ఖరీఫ్‌కు సరిపడా సాగునీటి కొరత లేకుండా ఉంటుందని పలువురు రైతులు కోరుతున్నారు.



చింతలపల్లిలో పచ్చదనంతో నిండిన వరిపంట



దామెర గ్రామ సమీపంలో కళకళలాడుతున్న పత్తి పంట



ఎల్కతుర్తి శివారులో ఏపుగా పెరిగిన మొక్కజొన్న పంట

42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

- శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి



శాయంపేట : మాట్లాడుతున్న మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి

శాయంపేట : రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలని శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ నాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ అమలు లేనిపక్షంలో బీసీల చేతుల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. దేశంలో మెజార్టీ ఉన్నది బీసీలని కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్ కల్పించకుండా రాజ్యాధికారాన్ని దూరం చేసిందని మండిపడ్డారు. దేశంలో, రాష్ట్రంలో ఎవరూ అధికారంలోకి రావాలన్నా బీసీలతోనే సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఐనవోలు: రాస్తారోకో చేస్తున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు లింగయ్య, తదితరులు

ఐనవోలు : కేంద్ర ప్రభుత్వం ఈ నెల 24న పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించేలా బిల్లును ఆమోదించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లింగయ్య మాట్లాడుతూ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించే బిల్లును ఆమోదించి గవర్నర్‌కు పంపగా అక్కడి నుంచి మార్చి 30న రాష్ట్రపతి వద్దకు చేరిందన్నారు. ఐదు నెలలుగా బిల్లు పెండింగ్‌లోనే ఉందని వాపోయారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చిత్త శుద్ధిలేదని, ద్వంద వైఖరిని అవలంబిస్తూ తెలంగాణ బీసీలను మోసం చేస్తుందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు అన్యాయం చేసిందని, ప్రస్తుతం మోసపూరిత వైఖరితోనే ఉందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కొంకాల నారాయణరెడ్డి, గబ్బెట రామ్ కుమార్, వరికాల్ గోపాల్, చిన్న మహేందర్, కుమారస్వామి, లెంకల నర్సయ్య పాల్గొన్నారు.

దివ్య ఫలం.. డ్రాగన్ ఫ్రూట్

కాజీపేట రూరల్: సామాన్యులకు సీజనల్ ఫ్రూట్‌లో డ్రాగన్ ఫ్రూట్ దివ్య ఫలం లాంటిది. విదేశీ పండు అయిన ఈ ఫ్రూట్.. ఇప్పుడు రైతులు తమ వద్ద కూడా పండిస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్‌లో విటమిన్ సీ, ఐరన్, మెగ్నీషియం ఎక్కువగా ఉంటుంది. ఈ పండులో నీరు, పీచు సమృద్ధిగా ఉండడంతో జీర్ణక్రియను మెరుగుపరిచి, మలబద్ధకాన్ని నివారిస్తుంది. గుండె జబ్బులను దరి చేరనివ్వదు. డ్రాగన్ ఫ్రూట్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మానికి ఎంతో మేలు చేయడంతో పాటు రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. ఈ పండులో ఉండే ఒమేగా ఫ్యాట్స్, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. శరీరానికి హాని కలిగించే ఫ్రీ రాడికల్‌ను నాశనం చేసి క్యాన్సర్ ముప్పును అడ్డుకుంటుందని వైద్యులు చెబుతున్నారు. డ్రాగన్ ఫ్రూట్ మార్కెట్‌లో రూ.40, రూ.50తో పాటు సైజ్‌ను బట్టి కిలోకు రూ.100 నుంచి రూ.150లు వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు.



100 గ్రాముల డ్రాగన్ ఫ్రూట్‌లో..

100 గ్రాముల డ్రాగన్ ఫ్రూట్‌లో 60 కేలరీల శక్తి, 13 శాతం కార్బోహైడ్రేట్లు, 3 శాతం ఫైబర్, సున్నా కొలెస్ట్రాల్, 1.2 గ్రాముల ప్రొటీన్లు, పుష్కలంగా మినరల్స్, పాస్పరస్, జింక్, కాల్షియం ఉంటాయని వైద్యులు అంటున్నారు.

ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు



కొత్తపల్లిగోరి మీదుగా రద్దీగా వెళ్తున్న వాహనాలు

రేగొండ: ములుగు జిల్లాలోని మల్లంపల్లి వద్ద రోడ్డు వెడల్పు పనులలో భాగంగా పాత బ్రిడ్జి కూలింది. కాగా ఏటూరునాగారం నుంచి హనుమకొండకు వెళ్లే వాహనాలకు అంతరాయం ఏర్పడింది. దీంతో జాకారం నుంచి కొత్తపల్లిగోరి మీదుగా రేగొండ, పరకాల నుంచి హనుమకొండకు వాహనాలు ప్రయాణిస్తున్నాయి. అలాగే హనుమకొండ నుంచి కూడా ఇదే దారిగుండా వాహనాలు ప్రయాణిస్తున్నాయి. దీంతో ఈ దారి గుండా ప్రయాణిస్తున్న ప్రయాణికులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల వాహనాలకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. స్థానికులు ఏటూరునాగారం నుంచి హనుమకొండకు లేదా హనుమకొండ నుంచి ఏటూరునాగారం వైపు వెళ్లే ఏదో ఒక వాహనాలను మాత్రమే అనుమతించాలని డిమాండ్ చేస్తున్నారు.

వివేకానంద యువజన సంఘం ఎన్నిక

మడికొండ: గ్రేటర్ వరంగల్ వినాయక నగర్ వివేకానంద యువజన సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెనుకుల సతీష్, ఉపాధ్యక్షులుగా బోగి మహేష్, మండల సురేష్, ప్రధాన కార్యదర్శిగా మాచర్ల రంజిత్‌కుమార్, కోశాధికారిగా నిగ్గుల ప్రశాంత్, ప్రచార కార్యదర్శిగా నిగ్గుల రవి, కార్యవర్గ సభ్యులుగా బోగి మనోజ్‌కుమార్, వినయ్‌కుమార్, రాయికంటి ప్రణయ్, ఆర్.హరిప్రసాద్, గోపనబోయిన వీరేష్, ముష్కే శ్రీకాంత్, గుడికందుల శ్రీనివాస్, నిగ్గుల మధు, మురళి, రాకేష్, దువ్వ నరేష్, బోగి సత్యనారాయణ, ఎండీ.అంకూస్, గౌరవ అధ్యక్షులుగా కుర్ల మోహన్, నిగ్గుల వెంకటప్రసాద్, కుక్కల సమ్మయ్య, మాచర్ల వీరస్వామి, గౌరవ సలహాదారులుగా గుడికందుల లక్ష్మణ్, బోగి రమేష్, కల్లెపు నరేష్, కల్లెపు కుమారస్వామి, కుర్ల ఐలయ్యను ఎన్నుకున్నట్లు కాంగ్రెస్ 64వ డివిజన్ అధ్యక్షుడు కుర్ల మోహన్, వాల్మీకి సంఘం జిల్లా సభ్యుడు నిగ్గుల వెంకటప్రసాద్ వెల్లడించారు.



యువజన సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 11న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. సిద్ధార్థనగర్ ప్రాంతంలో ఉదయం 10.15 నుంచి 11.15 వరకు, సమ్మయ్యనగర్, కుడా కాలనీ, శంకర్ నగర్, ఆదర్శ నగర్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, హంటర్ రోడ్డు టెంపుల్ ట్రీ విల్లాస్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. నర్సంపేట రోడ్డు, 100 ఫీట్ రోడ్డు, చెన్నారెడ్డి కాలనీ, ఎస్ఆర్‌టీ కాలనీ, లేబర్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

75 మంది రైతులకు ఎఫ్‌పీఓ సభ్యత్వం



రైతులకు సభ్యత్వం అందజేస్తున్న చైర్మన్ వనంరెడ్డితో రవీందర్ యాదవ్

కాజీపేట: రైతు ప్రాథమిక సహకార సంఘంలోని 75 మంది రైతులకు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ) సభ్యత్వాన్ని కాజీపేట మండలం సోమిడి గ్రామ రైతు సంఘం కార్యాలయ ఆవరణలో ఆదివారం అందజేశారు. దర్గా కాజీపేట ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు ఊకంటి వనంరెడ్డి, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ కలిసి రైతులకు సభ్యత్వ రశీదులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఫ్‌పీఓ స్కీంలో అర్హులైన రైతులు చేరాలని సూచించారు. సమావేశంలో సంఘం డైరెక్టర్లు మెరుగు రాజయ్య యాదవ్, కాయిత రాజ్‌కుమార్ యాదవ్, లింగం నరేందర్ రెడ్డి, గాలిరెడ్డి, బొల్లికొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలి

- పార్టీ మండల కార్యదర్శి రాజ్‌కుమార్

ఎల్కతుర్తి : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తెలంగాణ రాష్ట్ర నాల్గో మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి శనిగరం రాజ్‌కుమార్ నాయకులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బస్టాండ్ సమీపం వద్ద రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఐ వందేళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన పార్టీ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ముందు వరుసలో ఉండి పోరాడిన ఘనత సీపీఐ పార్టీదే అన్నారు. 4,500 మంది ప్రాణాలను బలిదానం చేసి 3000 గ్రామాలను విముక్తి చేసి భూమిలేని నిరుపేదలకు భూములు పంచి ఇచ్చిన చరిత్ర సీపీఐ పార్టీదే అన్నారు. ఆగస్టు 20, 21, 22వ తేదీల్లో మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలోని గాజులరామారంలో జరిగే మహాసభలకు కమ్యూనిస్టులందరూ అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉట్కూరి రాములు, జిల్లా సమితి సభ్యుడు వెంకటరమణ, నాయకులు విజయ్, మొండయ్య, చంద్రమౌళి, కృష్ణాకర్, ప్రకాష్, తులసీరామ్ పాల్గొన్నారు.



రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ఇందిరమ్మ రాజ్యం.. ఇంటింటి సౌభాగ్యం

పరకాల : పేదింటి కల నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదప్రజల సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన కొనసాగుతుందని మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్ అన్నారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాసంక్షేమ పథకాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తుండగా పరకాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ప్రజలు పడుతున్న సమస్యలను పరిష్కరిస్తున్నారని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటి సౌభాగ్యం నెలకొందన్నారు. సమావేశంలో కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ కౌన్సిలర్ సంపత్ కుమార్

ఓటర్ల తొలగింపు ప్రజాస్వామ్యానికి విఘాతం



మాట్లాడుతున్న కార్యదర్శి భిక్షపతి

న్యూశాయంపేట: దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా నుంచి పెద్దమొత్తంలో ఓటర్లను తొలగించడం ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విఘాతమని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో హనుమకొండ మండల సమితి -1 సమావేశం అలువాల రాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు ఉద్యమ పోరాటాలు చేయాలని సూచించారు. ఈ నెల 20 నుంచి 22 వరకు మూడు రోజుల పాటు జరగనున్న పార్టీ 4వ రాష్ట్ర మహాసభలకు తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు టి.భిక్షపతి, ఏ.శ్రీనివాస్, మండల కార్యదర్శి అశోక్ స్టాలిన్, మండల నాయకులు సుదర్శన్, రాజేందర్, రాంగోపాల్, కృష్ణ, అమృతయ్య, రమేష్, దేవా, బాబు, సదానందం, పద్మ, మంగ పాల్గొన్నారు.

కోచ్ ఫ్యాక్టరీలో ఉద్యోగావకాశాలు కల్పించాలి

- ఎంపీ కడియం కావ్యకు బాధితుల వినతి

కాజీపేట రూరల్: కాజీపేట మండలం అయోధ్యపురంలో నిర్మిస్తున్న మల్టీపర్పస్ కోచ్ ఫ్యాక్టరీలో తమకు ఉద్యోగావకాశాలు కల్పించి తమ కుటుంబాలను ఆదుకోవాలని అయోధ్యపురం భూ నిర్వాసితులు కోరారు. ఈ మేరకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గాదం యాదగిరి మాట్లాడుతూ రైల్వే యూనిట్‌లో గ్రామస్తులు సుమారు 152 ఎకరాల భూమి కోల్పోయారని తెలిపారు. వచ్చే ఏడాది ప్రారంభించే రైల్వే యూనిట్‌లో భూములు కోల్పోయిన బాధితులందరికీ ఉద్యోగావకాశాలు కల్పించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మెరుగు రాజయ్య, వీరయ్య, మామిండ్ల భిక్షపతి, ప్రవీణ్‌కుమార్, కాయిత కుమార్, గాదెం విజయ్‌కుమార్, బైరబోయిన రాజు, ఇలాసాగరం రాజు, జేరిపోతుల అనిల్, కాయిత కుమారస్వామి, గాదెం శ్రీనివాస్, జేరిపోతుల వినోద్ పాల్గొన్నారు.



ఎంపీ కావ్యకు వినతిపత్రం ఇస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ బాధితులు

'అమెరికా దుశ్చర్యలను వ్యతిరేకించండి'

ఖిలా వరంగల్: అమెరికా దుశ్చర్యలను ప్రతీ ఒక్కరూ వ్యతిరేకించాలని కార్మిక రైతు సంఘాల నాయకులు రమేష్, బాబు,బాలరాజు, అరూరి కుమార్, ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. భారత దేశ దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 50శాతం సుంకం విధించడానికి నిరసిస్తూ ఈ నెల 13న వరంగల్ చౌరస్తాలో కిసాన్ మోర్చా జాతీయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే దిష్టిబొమ్మ దహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో రైతు సంఘ నాయకుడు శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం సమావేశంలో వారు మాట్లాడుతూ రష్యా నుంచి భారత్ చమురు దిగుమతి చేసుకోవద్దని అమెరికా బెదిరిస్తోందని అన్నారు.

చేనేత సంఘానికి ఎన్నికలు జరిగేనా ?

- ఏడేళ్లుగా కొనసాగుతున్న పర్సన్ ఇన్‌చార్జ్‌ల పాలన
- వయో వృద్ధులైన పాలకవర్గం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికులు

శాయంపేట : చేనేత సంఘాలను బలోపేతం చేసేందుకు పాలకవర్గాలను ఐదేళ్లకోసారి ఎన్నుకునేవారు. మండల కేంద్రంలోని చేనేత సంఘానికి ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం 7 ఏళ్లుగా పర్సన్ ఇన్‌చార్జ్‌లతో పాలకవర్గాన్ని కొనసాగిస్తూ వచ్చారు. చేనేత సంఘాల పర్సన్ ఇన్‌చార్జ్‌లు వయోవృద్ధులైనా గత, ప్రస్తుత ప్రభుత్వంలో సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం లేదు. ప్రభుత్వం సంఘాల ఎన్నికలపై దృష్టి సారించాలని చేనేత కార్మికులు కోరుతున్నారు

ఏడేళ్లుగా జాడే లేదు..

స్థానిక చేనేత సంఘానికి ఎన్నికల జాడే లేకుండా పోయింది. 2013లో ఎన్నికలు నిర్వహించగా అప్పుడు ఎన్నికైన పాలకవర్గం గడువు 2018 ఫిబ్రవరిలో ముగిసింది. తిరిగి వీరినే పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించి అర్నెళ్లకోసారి పొడిగిస్తూ వచ్చారు. సంఘంలో పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతున్న పాలకవర్గ సభ్యులు వృద్ధులు కాగా అందులో ఇద్దరు మృతి చెందారు.

నిర్వీర్యమవుతున్న సంఘాలు

చేనేత సంఘాలకు నూతన పాలకవర్గాలు లేకపోవడంతో నిర్వీర్యమవుతున్నాయి. ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తే ఎన్నికైన సభ్యులు అభివృద్ధికి కృషి చేసేవారు. స్థానిక ఎమ్మెల్యేను కలిసి నిధులు తీసుకురావడం, కార్మికులకు గిట్టుబాటు కూలీ కల్పించేందుకు ప్రయత్నించే వారు. పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా ఉన్న వారు పట్టించుకోకపోవడంతో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కార్మికులు కోరుతున్నారు.



శాయంపేటలోని చేనేత సహకార సంఘం

ఎన్నికలు నిర్వహించాలి



ప్రభుత్వం చేనేత సంఘాలకు ఎన్నికలను పర్సన్ ఇన్‌చార్జ్‌లతో కొనసాగించడంతో రోజురోజుకు నిర్వీర్యమవుతున్నాయి. వారు కూడా వృద్ధులు కావడంతో కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని ఎన్నికలు నిర్వహించాలి.

– వనం దేవరాజ్, చేనేత సంఘం సభ్యుడు శాయంపేట

వెటర్నరీ డాక్టర్ కుటుంబానికి ఆర్థిక సాయం

మడికొండ: మడికొండకు చెందిన వెటర్నరీ డాక్టర్ నటరాజ్ కుమార్ కుటుంబానికి తెలంగాణ వెటర్నరీ అసోసియేషన్ (టీవీఏ) ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. నటరాజ్ కుమార్ ఇటీవల మృతి చెందగా, ఆయన పెద్దకర్మకు కార్యవర్గ సభ్యులు ఆదివారం హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీవీఏ ప్రధాన కార్యదర్శి రాము, మురళీధర్ రావు, రవీందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న టీవీఏ ప్రతినిధులు